# వదలిన భయం

"ఎప్పుడుచూసినా ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ ఉంటారు. అల్లా ఉండకూడదు. ఏదైనా చదువుకోండి. లేక పోతే మెదడు పాడై పోతుంది. పోనీ మీవాళ్ళెవరైనా వచ్చి కబుర్లు చెపుతూ ఉండగూడదూ? ఎవళ్ళూ రారేం?" అన్నది అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన నర్సు శ్యామల. ఎర్రగా, పొట్టిగా, బొద్దుగా ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా సంతోషంతో ఉప్పొంగుతూ ఉన్నట్లుంటుంది. పనికూడా చురుగ్గా ఎంతో నేర్పుతో చేస్తుంది. శ్యామల గదిలోవున్న కాస్సేపు రాజేశ్వరమ్మ సంతోషంగా వుంటుంది. శ్యామల మాటకు జవాబుగా చిరునవ్వుతో అన్నది.

"ఏం చేయమంటారూ? ఎప్పుడూ నిద్రరాదుగా? మావారు తెచ్చిన పత్రికలన్నీ మొన్ననే చదివేశాను" అని.

శ్యామల మామూలుగా సాయంత్రంవేళ అందరికీ జ్వరం అదీ చూసి వ్రాసిపెట్టాలి. అందుకే వచ్చింది. ఆపని పూర్తిచేసింది. తిరిగి వెళ్ళబోతూ రాజేశ్వరమ్మను ఒంటరిగా వదలి వెళ్ళలేక సంకోచిస్తూ మళ్ళీ అన్నది. "పాపం ఒంటరిగా వున్నారు. మీవారు వచ్చి నాలుగురోజులైనట్లున్నది. మీఅమ్మాయికూడా రాలేదే?"

రాజేశ్వరమ్మ విచారం దాచుకుని చిరునవ్వుతో అన్నది. "ఫరవాలేదు, మీరు వెళ్ళండి. నాకు అలవాటేగా ఒక్కదాన్నీ వుండడం. మీరింకా అందర్నీ చూచుకోవద్దూ?"

"మరే! ఇంకా తక్కినగదులకు వెళ్ళాలి, మళ్ళా వస్తా" అని అంటూ వెళ్ళిపోయింది శ్యామల.

రాజేశ్వరమ్మ శూన్యంగా, తిరుగుతున్న సీలింగ్ ఫాన్ కేసి చూస్తూ పడుకుంది. ఆమె ఈ నర్సింగ్‌హోమ్‌లో జేరి ఆరునెలలైంది. పెద్ద జబ్బేమీలేదు. రక్తహీనత, నరాల బలహీనం, ఇంట్లోవుంటే విశ్రాంతి తీసుకోదని, నర్సింగ్ హోమ్‌లో వుంటే విధిగా విశ్రాంతి ఉంటుందని చేర్పించారు. కాని ఆమె కోలుకోవటంలేదు. ఎన్నిమందులు వాడినా రోజు రోజుకూ క్షీణించిపోతూనేవుంది. కారణం కనిపెట్టలేక డాక్టరు తెల్లపోతున్నాడు. మందులు మార్చి మార్చి వాడుతున్నారు.

రాజేశ్వరమ్మ భర్త కోటేశ్వరరావు ఒక పెద్ద కంపెనీలో మేనేజరు, వేయిరూపాయల జీతం, యింట్లో వంటవాడు, నౌకర్లు, కారు, టెలిఫోను అన్నిహంగులు ఉన్నాయి. ముగ్గురు పిల్లలు. పెద్దకూతురు కామేశ్వరి దూరాన జబ్బల్‌పూర్‌లో వున్నది. ఆపిల్ల భర్తకక్కడ ఉద్యోగం. దూరాన వుండడంచేత ఎప్పుడోగాని పుట్టింటికి రాదు. ఏడాదిక్రిందట పురిటికివచ్చి వెళ్ళిన పిల్ల మళ్ళా రానేలేదు. రాజేశ్వరమ్మకు సుస్తీఅని తెలిసినప్పటినుంచీ రావాలనే ప్రయత్నం, అల్లాగే పోతోంది. కొడుకు పైచదువులకని అమెరికా వెళ్ళి రెండేళ్ళయింది. ఈ నెల్లోనో, పైనెల్లోనో వస్తాడనుకుంటున్నారు. దూరానవుండి దిగులుపడతాడని అసలతనికి రాజేశ్వరమ్మ సుస్తీ సంగతి రాయనేలేదు. చిన్నకూతురు సుజాతమాత్రం ఇంటిదగ్గరేవుండి చదువుకుంటోంది. రాజేశ్వరమ్మ నర్సింగ్

హోమ్‌లో చేరినప్పటినుంచి యింటి భారమంతా ఆపిల్లమీాదే వుంది. ఏమీా తెలియకపోయినా ఎట్లాగో జరుపుతున్నది.

రాజేశ్వరమ్మ ఇంట్లో ఉన్నన్నాళ్లు అన్నీ ఆవిడే చూసుకునేది. ఇంట్లో ఎందరువున్నా పూలల్లో దాగిన దారంలా, వెనకాలవుండి తాను ఏపని చేస్తున్నదీకూడా ఎవరికీ తెలియకుండా, అన్నీ చూచుకుంటూవుంటే అందరికీ అన్నీ వేళకు అందుతూవుండేవి. కోటేశ్వరరావుకు నీళ్ళగది లోకి వెళ్ళినప్పుడు సబ్బూ, తువ్వాలూ తయారుగా ఉండడం, బల్లదగ్గరకు వెళ్ళినప్పుడు భోజనంకానీ, కాఫీ ఫల హారంగాని తనకోసం ఎదురుచూస్తూ ఉండడం అంటే తెలు సునుగాని అవన్నీ ఎవరు అమర్చిపెడుతున్నారో తెలిసేది కాదు. అతనూ పట్టించుకునేవాడు కాదు. అతనికి ఎప్పుడూ ఆఫీసు, క్లబ్బూ, స్నేహితులు, విందులు ఇల్లా కార్యక్రమం సరిగ్గా ఉండేది. భార్యతోగాని, పిల్లలతోగాని కూర్చుని కబుర్లుచెప్పడానికి ఎక్కువ తీరిక ఉండేదికాదు.

ఓరోజు అతను కాఫీ తాగుతూవుండగా "ఇంకా స్తేనా ?" అన్నది పక్కనే నిలబడిన భార్య రాజేశ్వరమ్మ. కొత్తగాతోచిన ఆ కంఠం విని ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాడు కోటేశ్వరరావు.

"అదేమిటే? అంత నీరసంగావున్నదిమాట" అన్నాడు. రాజేశ్వరమ్మ కలవరపడింది.

"ఆఁ! ఏమిటో! నీరసంగానే ఉంటోంది. ఒంటో బాగుండడంలేదు" అన్నది నిర్లక్ష్యంగా మాట తుంచెయ్యా లని ప్రయత్నంచేస్తూ. కోటేశ్వరరావు మరింత ఉలిక్కి

పడ్డాడు. అప్పుడే రాజేశ్వరమ్మను నఖశిఖపర్యంతమూ పరికించి చూశాడు. మనిషి పాలిపోయివున్నది. శరీరం ఎముకలుతప్ప ఏమీలేనట్లు ఎండిపోయివున్నది. కళ్ళల్లో కాంతిలేదు. కోటేశ్వరరావుకు అంతా అయోమయంగా తోచింది. కంగారుపడుతూ అన్నాడు.

"నాతో ఎందుకు చెప్పలేదూ ఒంటో బాగుండలేదని? ఉండు డాక్టరుగార్ని రమ్మంటాను సాయంత్రం."

"ఏమని చెప్పనూ ? ప్రత్యేకం జబ్బేమీ లేదుగా ?" అన్నది రాజేశ్వరమ్మ నెమ్మదిగా. కోటేశ్వరరావు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రనుంచి డాక్టర్ శోభనాచలం వచ్చి వైద్యం ప్రారంభించాడు. ఓ నెలరోజులు వస్తూ పోతూ వుండగా ఆయనకూ అర్థమైంది రాజేశ్వరమ్మ ఇంటి పరిస్థితి. ఇంటో వుండి ఎన్ని మందులు తిన్నా ఏమీ లాభంలేదు. రాజేశ్వరమ్మకు మనస్సుకూ శరీరానికికూడా విశ్రాంతి వుండదు. అంచేత నర్సింగ్ హోమ్‌లో చేరితే తప్ప ప్రయోజనంలేదు. అక్కడ త్వరగా కోలుకోవచ్చు అనుకున్నాడు. ఆమాటే చెప్పాడు కోటేశ్వరరావుతో. అతను వెంటనే ఒప్పుకున్నాడు. రాజేశ్వరమ్మకు ఇల్లువదలి నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళాలని లేదు. కాని ఆమెకూ తెలుసు. ఇంటిదగ్గరే ఉన్నన్నాళ్లు తనకు విశ్రాంతి వుండదని. ఇంటికి ఎవరైనా అనుకోకుండా అతిథులు వచ్చినప్పుడే వంటవాడికి తప్పనిసరిగా తలనొప్పి వస్తుంది. ఇంట్లో ఎవరికైనా సుస్తీగా ఉన్నప్పుడే పనిమనిషికి అవసరంగా ఊరికి వెళ్ళవలసి వస్తుంది. అంచేత తనకు చాకిరీ తప్పదు.

ఎంత ఓపిక లేకపోయినా చేయక తప్పదు. అందుకని ఆమె మాట్లాడకుండా ఊరుకున్నది. కోటేశ్వరరావు ఆమెను నర్సింగ్ హోమ్‌లో చేర్పించాడు.

ఆ నర్సింగ్ హోమ్ ఊరిచివర ఉన్నది. విశాలమైన ఆవరణ, పెద్ద తోట, మధ్యన పెద్ద పెద్ద గదులతో బంగాళాలు. రాజేశ్వరమ్మ గది మేడమీద వున్నది. వరసగా గదులు, ముందర పెద్ద వరాండా, ఈ చివరా ఆచివరా మాత్రం వరండాముందుకు మలుపు తిరిగి అక్కడ మళ్ళాగది. రాజేశ్వరమ్మ ఆ చివరగదిలో వుంటున్నది. ఆమెకు తక్కిన గదుల్లో ఉన్నవాళ్ళతో ఏమీ సంబంధం లేదు. ఎప్పుడైనా వసారాలో జనం తిరుగుతూ ఉన్నప్పుడు అలికిడి అయ్యేది. అంతే. రాజేశ్వరమ్మ ఎప్పుడూ అటువేపు వెళ్ళేదికాదు. అటు వేపు ఉన్న కిటికీ తెరిచేదికాదు. తన గదిలో తాను ఒంటరిగా వుండేది.

నర్సింగ్ హోమ్‌లో సాయంత్రం నాలుగు నుంచి ఉదయం పదిగంటల వరకు నర్స్ శ్యామల వుంటుంది. పది నుంచి నాలుగువరకూ మధ్యాహ్నమంతా కోమల వుంటుంది. వీళ్ళిద్దరే మేడమీద గదులన్నీ చూచుకుంటారు. కోమల ఆకారమూ, స్వభావమూ శ్యామలకు అన్నివిధాల విరుద్ధంగా వుంటాయి. కోమల నాజూకుగా, నల్లగా, నీరసంగా వుంటుంది. పలకరిస్తేనేగాని మాట్లాడదు. అదైనా అడిగినదానికి సమాధానం చెప్పటంవరకే. తన పని మాత్రం శ్రద్ధగా, విధిగా చేసుకుపోతూంది. రాజేశ్వరమ్మకు కోమలతో ఎక్కువ పరిచయం కలగలేదు. కోమల వున్నంతసేపు రాజేశ్వరమ్మ

నిద్రపోతుంటుంది. కనీసం మాట్లాడాల్సిన అవసరం లేకుండా కళ్లు మూసుకు పడుకుంటుంది. 'ఇది నా బాధ' అని చెప్పటం గాని, 'ఇది నాకు కావాలి' అని అడగటం కాని రాజేశ్వరమ్మకు ఎప్పుడూ అలవాటు లేదు. నర్సులు వేళకిచ్చిన మందులు పుచ్చుకొని యింటినుంచి ఆహారం వచ్చినప్పుడు తినేది. అంతే. ఇక సంభాషణకు ఎక్కువ అవకాశమూ వుండదు.

సాయంత్రం వచ్చిన శ్యామల మాత్రం తీరికవున్నప్పుడల్లా వచ్చి కూర్చుని రాజేశ్వరమ్మతో కబుర్లు చెపుతూ వుంటుంది. ఆవిడ కుటుంబ వ్యవహారాలు అడిగి కనుక్కుంటూ వుంటుంది. లేదా తక్కిన గదుల్లోని పేషంట్ల కథలు చెబుతూ వుంటుంది. ఒంటరిగావున్న రాజేశ్వరమ్మను చూస్తే శ్యామలకు చాలాజాలి. తక్కిన గదుల్లో వాళ్ళందరికి రోజూ యింటి దగ్గరనుంచి ఎవరో ఒకరు వస్తూ పోతూవుంటారు. సాయంత్రం వేళ ఇంకా చాలామంది వస్తారు. రాజేశ్వరమ్మకు రెండు మూడు రోజులకొకసారి తప్ప ఎవరూరారు. ఇంటిదగ్గర భర్తా, చిన్నకూతురు తప్ప ఎవరూలేరు. వాళ్ళకు తీరిక వుండదు. ఎప్పుడైనా వచ్చినా ముళ్ళమీద వున్నట్లు పది నిమిషాలు వుండి వెళ్ళిపోతారు. రాజేశ్వరమ్మ ఒక విధంగా ఒంటరి తనానికి అలవాటుపడింది.

నర్సింగ్ హోమ్‌లో చేరిన రోజు రాత్రి పదిగంటలకు శ్యామల వచ్చి కూర్చుంది రాజేశ్వరమ్మ గదిలో. ఒంటరిగా ఆ గదిలో ఆమె దిగులుపడుతూన్నట్లుంది. శ్యామలకు జాలేసింది.

"ఒక్కరే పడుకుంటారా? మీవాళ్ళెవరూ రారూ?" అన్నది శ్యామల.

రాజేశ్వరమ్మ దిగులుగా చూసింది.

"ఎవరొస్తారు? మా అమ్మాయి చిన్నపిల్ల. అది వచ్చి ఏం జేస్తుంది? అయినా అదికూడా లేకపోతే ఇంట్లో జరగదు" అన్నది. శ్యామల మాట్లాడలేదు. గదిలో వస్తువులన్నీ సర్దుతూ వూరుకున్నది. కాస్సేపటికి మళ్లా అన్నది.

"మీరు ఒక్కరూ పడుకోగలరా? అప్పుడప్పుడు నేనూ వచ్చి చూసి పోతూంటాను లెండి"

రాజేశ్వరమ్మ మనస్సులో నీడలు కమ్ముకున్నాయి. పైకి మాత్రం ముభావంగా అన్నది.

"ఏం ఫరవాలేదు లెండి. నా కలవాటే ఒంటరిగా వుండడం" అని.

"ఏదైనా అవసరం అయితే కాల్ బెల్ నొక్కండి వస్తాను" అని శ్యామల వెళ్ళిపోయింది. వెళుతూ, వెళుతూ గదిలో వరండాలో దీపాలన్నీ ఆర్పేసింది.

గది అంతా చీకటి నిండుకున్నది. తలుపూ ఒక కిటికీ మాత్రం తెరచే వున్నాయి. కాని కిటికీకి కట్టిన ముతక తెరగుడ్డ మూలాన గదిలోకి ఏమాత్రమూ బయటి వెలుగు రేకలు ప్రసరించడం లేదు. తలుపుకు కట్టిన తెర సగం పక్కకు తొలగివుంది. మంచం గుమ్మానికి ఎదురుగానే వుంది. ఆ సందులో నించి సన్నని వెలుగు రాజేశ్వరమ్మ ముఖంమీద పడుతోంది. వరండా కవతల బయటి ఆవరణలో ఎత్తుగా ఎదిగిన చెట్ల కొమ్మలు నీడల్లా కనపడుతున్నాయి. ఎంత

ప్రయత్నించినా ఇంకేమీ కనపడదు. గాలి కదలినప్పుడల్లా తెరగుడ్డలు రెపరెపమని కొట్టుకుంటున్నాయి. చెట్లకొమ్మలు ఒరుసుకుని కీచుకీచు మంటున్నాయి. ఏమూలో నిద్రపోలేని పక్షులు విచారంతో మళ్లా మళ్లా కూస్తున్నాయి. ఎక్కడో ఎవరిచేతిలో నుంచో గాజుపళ్లెం జారిపడి రోదన ధ్వనితో ముక్కలైంది.

రాజేశ్వరమ్మకు భయంవేసింది. ప్రాణాలు బిగపట్టుకొని ఈ రకరకాల ధ్వనులకు అలికిడికీ అలవాటుపడి నిద్రపోవాలని ప్రయత్నించింది. నిద్ర రాలేదు. గుండెలు కొట్టుకున్నాయి. దుఃఖం పొర్లుకొచ్చింది.

తనకు చిన్నప్పటినుంచీ ఒంటరిగా వుండటమంటేనే భయం. ఎప్పుడూ ఒంటరిగా వుండలేదు. చీకట్లో వుండలేదు. ఏదో కారణంలేని భయం. కాని తమాషాగా తనని ఎప్పుడూ ఒంటరితనమే వెన్నాడుతోంది! ఎందుకనో! ఆమెకు గడచిన విషయాలు గుర్తుకు వచ్చాయి.

చిన్నప్పుడు పన్నెండేళ్లు వచ్చేవరకూ తల్లిదగ్గరే పడుకునేది. తల్లి విసుక్కునేది, దూరంగా పక్కమంచంమీద పడుకోమని. ఆవిడ కోప్పడుతుందేమోననే భయంతో ప్రతి రాత్రి ఒదిగి ఒదిగి మంచం పట్టె కరుచుకుని నిద్రపొయ్యేది. అమ్మను వదలి దూరంగా తను వేరే పడుకోవాలంటే చాలా భయంగా వుండేది. ఒకరోజు రాత్రి అమ్మ గట్టిగా కోప్పడింది.

"అవతల మంచం వేసి వుంచేది ఎందుకోసం అనుకుంటావు. పన్నెండేళ్లొస్తున్నాయి. ఇంకా పక్కలో ఒదుగుతా వెందుకూ? వేరే పడుకోలేవూ? అసలే వేసవికాలం

ఉక్కపోసి చస్తుంటేనూ ?" అంటూ గబగబా లాగి పక్క మంచంమీద పడుకోబెట్టింది. ఆ రాత్రి తను నిద్రపోలేదు. చీమచిటుక్కుమన్నా భయపడుతూ బెంగగా పడుకుంది. మర్నాడు తన మంచం అమ్మకు దగ్గరగా లాక్కుని, ఆవిడ మంచంపట్టెను గట్టిగా పట్టుకుని కొంచెం ధైర్యంతో నిద్ర పోయింది.

పెళ్లైంది. అత్తవారింటికి వెళ్ళింది. అక్కడ అత్తా మామా క్రిందయింట్లోనే వుండేవారు. తనూ భర్తా మేడ మీద వుండేవారు. మొదట్లో గదిలో రెండుమంచాలు చూడ గానే ఎంతో సంతోషించింది. ఇంక తను ఎప్పుడూ ఒంటరిగా వుండనక్కరలేదు. అదే ఆనందం.

వారంరోజులయ్యాక ఓనాడు భర్త అన్నాడు.

"ఇవ్వాళ నేను ఆఫీసుపనిమీద ఢిల్లీ వెళ్ళాలి, తిరిగి రావటానికి పదిరోజులు పడుతుంది" అని.

అతను వెళ్ళిపోయ్యాడు. ఆరాత్రి మళ్ళా తనకు నిద్ర పట్టలేదు, మేడగది చుట్టూ ఖాళీడాబా, హోరుమని గాలి వీచేది. తను భయంతో తెల్లవార్లు మేలుకొనేది. తెల్లవారు ఝామున ఎప్పుడో తనకు తెలియకుండానే కళ్లు మూతలు పడేవి. అల్లాగే అలవాటయింది. నెలకు ఇరవైరోజులు భర్త ఆఫీసు పనులమీద ఊళ్లు తిరుగుతూనేవుండేవాడు. భయంతో, నిద్రతో పెనగులాడుతూ తాను రోజులు గడుపుతుండేది.

కొన్నాళ్ళకి తనకు కొడుకు పుట్టాడు. అప్పటినుంచి భర్తగది వేరు, తనగది వేరు అయినవి. పిల్లవాడి ఏడుపు గోలతో నిద్రవుండదని అతను వేరే గదిలో పడుకునేవాడు.

పసివాడిని గుండెల కదుముకుని తాను నిద్రపోయ్యేది. క్రమంగా ముగ్గురు పిల్లలు పుట్టారు. ముగ్గురిని చుట్టూ చేర్చుకుని తాను తృప్తిగా సుఖంగా వుండేది. అప్పటికి అత్త మామ లిద్దరూ పోయారు. తాను ఇంటికి అధికారిణి అయింది.

ఒకరోజు భర్త అన్నాడు. "పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారుగా? వాళ్ళకి వేరేగది ఏర్పాటుచేస్తే బాగుంటుంది. ఎప్పుడూ నిన్నే కరుచుకు కూర్చుంటే వాళ్లకి ధైర్యం ఎట్లా వస్తుందీ" అని.

తాను దిగులుపడింది. కాని భర్తమాటకు ఎదురు చెప్పలేదు. మళ్ళా ఒంటరితనం ఎదురైంది. మొదట్లో నిద్ర పట్టక రెండుమూడుసార్లు లేచి పిల్లల గదిలోకి వెళ్ళి చూసి వస్తుండేది. ఒక్కొక్కసారి యింటిపనులతో అలసిపోయి నిద్రపోయేది.

క్రమంగా పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళకు వ్యాపకాలు ఎక్కువైనాయి. పెద్దపిల్ల, పిల్లవాడూ ఇంటిపట్టున కూడా వుండకుండా దూరమైనారు. తాను ఒంటరిగా బ్రతకడం నేర్చుకున్నది. ఒంటరితనమంటే భయం మాత్రం పోలేదు. ఏదో భయం! ఏదో దిగులు! ఇవి మాత్రం వదలటం లేదు.

* * *

గడియారం ఏడుగంటలు కొట్టింది. కోటేశ్వరరావు వచ్చాడు.

ఏవో ఆలోచనలతో మునిగితేలుతున్న రాజేశ్వరమ్మ

మెల్లగా తేరుకుని చిరునవ్వుతో ఆహ్వానించింది. కోటేశ్వర రావు ప్రక్కన కుర్చీలో కూర్చున్నాడు.

"ఎట్లావుంది ఒంట్లో?"

రాజేశ్వరమ్మ నవ్వింది.

"ఏముందీ! మామూలే! బాగానే వున్నాను" అన్నది.

"రెండు రోజులుగా రావటానికి వీలుపడలేదు. చీఫ్ సెక్రటరీ వచ్చాడు. పని సరిపోతోంది. వద్దామనుకుంటూనే గడచిపోయింది. ఇప్పుడుకూడా విందుకు వెళ్ళాలి. అతను రేపు వెళ్ళిపోతాడు. అందుకని ఇవ్వాళ విందు ఏర్పాటు చేశాం" అన్నాడు విసుగ్గా రెండురోజులు రానందుకు సంజాయిషీ చెప్పుకుంటూ, తిరిగి వెళ్ళిపోవడానికి తొందరపడుతూ.

"ఫరవాలేదు లెండి. మీరు వచ్చి ఏం జేస్తారూ! ఈ జబ్బు ఇవ్వాళ రేపట్లో తేలేదేమీ కాదుగదా! మీ పనులు ఎట్లా పాడుజేసుకుంటారూ? మీ విందు ఎన్నింటికీ? వేళ అవుతున్నట్టున్నదే?" అన్నది రాజేశ్వరమ్మ.

కోటేశ్వరరావు మనస్సు స్థిమితపడింది. గడియారం చూసి అన్నాడు.

"ఎనిమిదింటికే! అయినా నేను కాస్త ముందుగా వెళ్ళాలి. ఏర్పాట్లన్నీ చూసుకోవాలిగా?"

"అవును. మీరు వెళ్ళండి. చాలాదూరం కూడాను" అన్నది రాజేశ్వరమ్మ.

"మరే! అదికూడా ఇబ్బందిగా వుంది. కారు సరిగా లేదు. షాపుకు పంపించాను. ఇంకా రాలేదు. అందుకనే

అమ్మాయి సుజాతకూడా రాలేకపోయింది. పాపం దానికీ ఇంట్లో సరిపోతోంది. అన్నట్లు శంకరం నీకు పళ్ళూ, పాలూ తెచ్చాడా?" అన్నాడు.

"తెస్తాడులెండి. ఇంకా గంటకాలేదుగా! సుజాతను బాధపడవద్దని చెప్పండి. ఎవరొచ్చి ఏం జెయ్యాలీ! శంకరం ఎట్లానూ వస్తూనే వుంటాడుగా? కబుర్లు తెలుస్తూనే వుంటాయి." అన్నది రాజేశ్వరమ్మ.

కోటేశ్వరరావు బయలుదేరాడు.

"మరి నేను వెళ్ళనా? ఏమన్నా కావలిస్తే నర్సును ఫోను చెయ్యమను" అన్నాడు.

రాజేశ్వరమ్మ నవ్వింది. ఏం కావాలీ తనకు? ఏమని ఫోన్ చెయ్యాలీ అనుకుంది. అతను వెళ్ళిపోయాడు.

రాత్రి పదిగంటలకు శ్యామల వచ్చింది. రాజేశ్వరమ్మ ఇంకా నిద్రపోలేదు. శ్యామల అన్నది! "అవతలి గదిలోకి ఎవరో పురిటికి వచ్చారు. ఈ రాత్రికే ప్రసవం అవుతుంది అనుకుంటున్నాము. నేను అక్కడే వుండాలి. ఇంక ఈ రాత్రికి మళ్ళా మీ దగ్గరకు రాలేనేమో! మీకు ఏమైనా కావాలా?" అని.

రాజేశ్వరమ్మ నవ్వింది.

"నాకేం కావాలీ? ఏమీ అక్కరలేదు" అన్నది.

శ్యామల వెక్కిరించింది.

"అబ్బ. నోరు తెరచి నాకిది కావాలని ఎప్పుడూ ఒక్కసారైనా అడగరు గదా! ఏం మనుష్యులో" అన్నది.

"అన్నీ అడక్కుండానే వస్తున్నాయిగదా!" అన్నది రాజేశ్వరమ్మ. ఇద్దరూ నవ్వారు. శ్యామల వెళ్ళిపోయింది.

ఆవేళ పూర్ణిమ. బయట మంచి వెన్నెల కాస్తోంది. తెరలు తప్పించుకొని పండు వెన్నెల గదిఅంతా నిండుతోంది. ఆవేళ రాజేశ్వరమ్మ మనస్సు హాయిగా తేలికగా వున్నది. ఆ వెన్నెల ఆమె మనస్సులో కూడా నిండినట్లుంది. ఆ నిముషంలో ఆమెకు ఏ దిగులూ, చింతా కలుగలేదు. భయమూ వెయ్యలేదు. అన్నీ వాటంతటవే వదలిపోయి నట్లనిపించింది. తానెంత పిచ్చిది! చిన్నప్పటినుంచి ఊరికినే భయం భయం అనుకుంటోంది. దేనిని గురించి భయం! ఎందుకూ భయం? మనస్సు కల్పించుకునే భ్రమలే భయాలు. అంతకన్నా ఏమీ లేదు.

తెరచిన తలుపులోనుంచి పున్నమచంద్రుడు పచ్చగా దగ్గరగా కనుపిస్తున్నాడు. రాజేశ్వరమ్మ ఆనందంతో ఆ చందమామను చూస్తూ పడుకుంది. ఇప్పుడు ఒంటరితనమూ లేదు, భయమూ లేదు, దిగులూ లేదు ఏవీ లేవు. నిర్మలంగా ఆ చందమామను అలా చూస్తూ చూస్తూ వుండగా ఆమెకు నిద్రవచ్చింది హాయిగా. ఆమెకు తెలియకుండానే కన్నులు మూతలుపడ్డాయి. నిద్రపోయింది.

తెల్లవారి ఎనిమిదిగంటలకు శ్యామల వచ్చింది. రాజేశ్వరమ్మ ఇంకా నిద్రలేవలేదు. ఆమె ముఖంలో ప్రశాంతి వెల్లివిరుస్తోంది. పెదవులమీద చిరునవ్వు చెరగలేదు. గది సర్దుతూ శ్యామల రెండు మూడుసార్లు పిలిచింది రాజేశ్వరమ్మను ఇంకా నిద్ర లేవలేదేమని. ఆమె పలుకలేదు. దగ్గ

రకు వెళ్ళి కదిపిచూసింది. కంగారుపడుతూ గబగబా వెళ్ళి పోయింది.

కాస్సేపటికి కోటేశ్వరరావు, సుజాత, డాక్టర్ శోభనాచలం, నర్సులూ, అందరూ చేరారు. గదిలో ఓదార్పులు, వ్యాఖ్యానాలు ఎవరికితోచినవివారు చేశారు.

"గుండెజబ్బు, అంతకన్న అనుకోటాని కేమీలేదు" అన్నాడు డాక్టర్.

"పాపం ఎప్పుడూ నవ్వుతూవుండేది. ఒక్కసారైనా బాధఅని అనలేదు" అన్నది కోమల.

"రాత్రి ఒక్కసారైనా వచ్చి చూడటానికి వీలుపడ లేదు. ఏం బాధపడిందో ఏమో!" అన్నది విచారంగా శ్యామల.

"ఒట్టి పిచ్చిది. ఎప్పుడూ ఒంటరిగా వుండటానికి భయపడేది. చివరి ఘడియకు ఒంటరిగానే వున్నది." బాధతో కళ్ళు ఒత్తుకున్నాడు కోటేశ్వరరావు.